క్లుప్తంగా

బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతం

ఏలేశ్వరం: బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో ఆదివారం బూత్ కమిటీల ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలో 63 బూత్ కమిటీల ద్వారా గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా మహిళలకు రూ.600లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి ధర్మరాజు, దాకే కృష్ణారావు, అడపా శివప్రసాద్, కురాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం


ఏలేశ్వరంలో దసరా ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణంలో శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద పందిరి రాట వేశారు. ఆలయం వద్ద అజిత్ చక్రవర్తి, రంజిత్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24 వరకూ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి, సుంకర రాంబాబు, శిడగం రాజేశ్వరరావు, దాకమర్రి లోవరాజు, మీసాల సత్యం, ఒమ్మికృష్ణ, చల్లా ప్రసాద్, శిడగం సురేష్, మజ్జి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఏలేశ్వరం: పట్టణంలోని మార్కెట్ జట్టు యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా మూది నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా శిడగం చిన్నారావు, కార్యదర్శిగా తాండ్రోజు సత్తిబాబు, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ జట్టు యూనియన్ సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గెద్ద రాము, కంచుబోయిన నాగేశ్వరరావు, కంది సత్తిబాబు, గొల్లపల్లి బాబూరావు, నోమ్సు రాజు, కోన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనం


ఏలేశ్వరంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో పట్టణంలోని గణపతి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని తీన్‌మార్ డ్యాన్సులు, బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు.

ప్రజా నాయకుడు 'పోకల' మృతి



గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన ప్రజా నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత పోకల వెంకట్రావు (76) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జగ్గంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఈయనే గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా ప్రజలకు మెరుగైన సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గండేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నియమించింది. ఆ పదవిలో కొనసాగుతున్న వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని రైతులు వాపోతున్నారు.

పోకల మృతికి సంతాపం

పోకల వెంకట్రావు మృతికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు యల్లమిల్లిలో పోకల భౌతిక కాయానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జీసీఎస్ మండల కన్వీనర్లు తాళ్లూరి మధు, బందారు రాజా తదితరులు వెంకట్రావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం జలజీవన్ మిషన్ పనులను ఆమె ప్రారంభించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందించనున్నట్టు ఆమె తెలిపారు. పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వసూల్‌మే సవాల్

- గ్రామాల్లో పేరుకుపోతున్న పన్ను బకాయిలు
- 6 నెలల్లో కేవలం రూ.12.60 లక్షల వసూలు
- ఆలస్యమైతే వసూళ్లపై ఎన్నికల ప్రభావం


వి.కొత్తూరు గ్రామం

తుని రూరల్: గ్రామాల్లో గృహ, గృహేతర పన్ను బకాయిలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు గడిచిపోయినప్పటికీ పన్నుల వసూళ్లలో ప్రగతి కానరాలేదు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ.5.70 కోట్ల డిమాండ్ ఉండగా కేవలం రూ.12.60 లక్షలే వసూలయ్యాయి.

నియోజకవర్గంలో...

తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో పాత బకాయిలు, ఈ ఏడాది డిమాండ్ రూ.5,71,52,154 ఉంది. వీటిలో ఇంటి పన్నులు రూ.4,87,63,402, గృహేతర పన్నులు రూ.83,88,752 ఉన్నాయి. ఇంటి పన్నులో రూ.8,14,632, గృహేతర పన్నులో రూ.4,46,328 బకాయిలు ఉన్నాయి. ఇవీ పాత బకాయిలు కావడం విశేషం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు మండలాల్లో ఒక్క రూపాయి వసూలు చేయకపోవడం గమనార్హం. రానున్న ఆరు నెలల్లో దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది తదితర పండగలతో పాటు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. దీంతో పన్నుల వసూలు మరింత కష్టతరమవుతుంది. ఎన్నికలు గృహ, గృహేత పన్నుల వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతాయని అధికారులే చెబుతున్నారు. ఉన్నతాధికారులు మేల్కొని క్షేత్రస్థాయిలో సిబ్బందికి సరైన దిశానిర్దేశం చేస్తే డిసెంబర్ చివరికి పన్ను వసూళ్లలో ప్రగతి కనిపించే అవకాశం ఉంది.

ప్రగతికి అవరోధం

గ్రామాభివృద్ధిలో ఇంటి పన్నులు ఎంతో కీలకపాత్ర వహిస్తాయి. ఏ గ్రామంలోనైనా తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ గ్రాంట్లతో పాటు ఇంటి పన్నులు, గృహేతర పన్నుల నుంచి వచ్చిన నిధులనే వినియోగించాల్సి ఉంది. గ్రామాభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలు పన్నులు స్వచ్ఛందంగా సకాలంలో చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలతో వసూళ్లు



గృహ, గృహేతర పన్నుల వసూళ్లు చేస్తున్నాం. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్లో పంచాయతీ సిబ్బంది పాల్గొంటున్నారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తాం. పన్ను వసూళ్లకు అవసరమైతే కార్యదర్శుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. వంద శాతం పన్నులు వసూలు చేస్తాం.
– జి.అరుణ్‌కుమార్, ఈఓపీఆర్డీ, కోటనందూరు

ఇంటి పన్ను బకాయిలు

మండలం	పంచాయతీలు	పాత బకాయిలు	ఈ ఏడాది డిమాండ్	మొత్తం డిమాండ్
తుని	23	రూ.64,55,967	రూ.1,20,71,327	రూ.1,85,27,294
తొండంగి	22	రూ.63,32,146	రూ.1,69,20,556	రూ.2,32,52,702
కోటనందూరు	17	రూ.13,16,780	రూ.56,66,626	రూ.69,83,406
మొత్తం	62	రూ.1,41,04,893	రూ.3,46,58,509	రూ.4,87,63,402

గృహేతర పన్ను బకాయిలు

మండలం	పాత బకాయిలు	ఈ ఏడాది డిమాండ్	మొత్తం డిమాండ్
తుని	రూ.7,99,737	రూ.8,72,165	రూ.16,71,902
తొండంగి	రూ.25,92,843	రూ.24,85,256	రూ.50,78,099
కోటనందూరు	రూ.44,44,425	రూ.11,94,326	రూ.16,38,751
మొత్తం	రూ.38,37,005	రూ.45,51,747	రూ.83,88,752

లోవకొత్తూరులో నేడు ఆరోగ్య సురక్ష

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఎల్ రాజశేఖర్ పర్యవేక్షణలో సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్లయ్యపేటలో..

తొండంగి: మండలంలోని జి.ముసలయ్యపేట పంచాయతీ ఎల్లయ్యపేటలో సోమవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వైద్యారోగ్యశాఖ సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తక్షణమే పనులు పూర్తి చేయాలి

జగ్గంపేట: నియోజకవర్గంలోని వివిధ పథకాలకు నిధులు మంజూరైనా పనులు పూర్తి చేయటం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పలు పథకాలు గురించి ప్రస్తావించి వాటిని తక్షణమే పూర్తి చేయాలని సూచించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం


కాకినాడ ఆసుపత్రిలో బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బూరుగుపూడి డెవలప్‌మెంట్ యూత్ సభ్యులు

కిర్లంపూడి: బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడు నెలల బాలుడి వైద్యానికి బూరుగుపూడి డెవలప్‌మెంట్ యూత్ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే... బూరుగుపూడి గ్రామానికి చెందిన పమ్మిరెడ్డి త్రిమూర్తులు, దేవీ దంపతుల కుమారుడు కార్తిక్ కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం ఎప్పటికీ తగ్గకపోవడంతో తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షలు చేసి బ్లడ్ ఇన్ఫెక్షన్‌గా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బూరుగుపూడి డెవలప్‌మెంట్ యూత్ సభ్యులు దాతల నుంచి రూ. 50 వేలు సమకూర్చారు. కాగా ఆదివారం బూరుగుపూడి డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు పాఠంశెట్టి తమ్మారావు కాకినాడ ఆసుపత్రికి వెళ్లి బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 10వ తేదీ నుంచి వైఎస్సార్ సీపీ నాయకులందరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా నేరుగా వారి ఇంటి వద్దకే పెన్షన్లు, సంక్షేమ లబ్ధి చేకూర్చుతున్నామని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పాలనను ప్రజలకు చేరువ చేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రభుత్వం అనేక మంచి కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పొందుతుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు అవినీతిలో కూరుకుపోయి జైలు పాలయ్యారని విమర్శించారు. టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలు, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను బూతులు తిట్టడం సిగ్గుచేటన్నారు. పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి అలమండ చలమయ్య, పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సాలివాహన అభివృద్ధి కమిటీ సభ్యుడు అనకాపల్లి నూకరాజు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును సత్కరించిన వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి పథకాలు అందించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబును పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మాజీ చైర్మన్ దాసరి తమ్మున్నదొర, నాయకులు సుంకర వీరబాబు, దాసరి సతీష్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీసెల్ జోన్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, తహసీల్దార్ సుగుణ, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని సోమవరం గ్రామంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎస్.అగ్రహారంలో...

రౌతులపూడి: వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎస్.అగ్రహారం కృష్ణాలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


గోకవరంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈఎన్‌టీ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ సత్తి రవికాంత్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, దాసరి రమేష్, వరసాల ప్రసాద్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

ఎస్పీ సతీష్ కుమార్


ఒమ్మంగి వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ప్రత్తిపాడు రూరల్: యువత వ్యసనాల బారిన పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఒమ్మంగిలో ఆదివారం రాత్రి నిర్వహించిన వారధి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు చేరువగా ఉండాలనే ఉద్దేశంతో వారిధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రజలు మత్తు పానీయాలు, జూద క్రీడలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై పవన్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ఇర్రిపాకలో ఎమ్మెల్యే చంటిబాబుతో కేక్ కట్ చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


ఎమ్మెల్యే చంటిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి, గోకవరం మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు మండలాల అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేయించారు. పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే తండ్రి జ్యోతుల రామస్వామి, గండేపల్లి, కిర్లంపూడి ఎంపీపీలు చలగళ్ల దొరబాబు, తోట రవి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ నేతలు తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, జి.శ్రీను, జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, భూపాలపట్నం ప్రసాద్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి నుంచి ర్యాలీగా ఇర్రిపాకలోని చంటిబాబు నివాసానికి వెళ్లి ఆయనతో 45 కేజీల భారీ కేక్‌ను కట్ చేయించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే చంటిబాబుకు గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, లంక మూర్తి, పెనగంటి రాజేష్, యల్లపు నానాజీ, బిళ్లకుర్తి శివాజీ, సంఘన వెంకటేశ్వరరావు, శరకణం సంతోష్, మొల్లేటి వీరబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబుకు శుభాకాంక్షల వెల్లువ


ఎమ్మెల్యే చంటిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోకవరం ఎంపీడీఓ పద్మజ్యోతి


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేత జోగేశ్వరరావు

గోకవరం: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని గోకవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గోకవరం వచ్చిన ఎమ్మెల్యే చంటిబాబు స్థానిక దేవీచౌక్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేకు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మీ, నాయకులు రౌతు జోగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అసమ్మతి స్వరాలపై దాడులు అమానుషం


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అర్జునరావు

ఏలేశ్వరం: జర్నలిస్టులు, పౌరహక్కుల సంఘ నాయకులు, న్యాయవాదులు, అసమ్మతి స్వరాలపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేయడం అమానుషమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అన్నారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలన ఎమర్జెన్సీని తలపించేలా ఉందన్నారు. ప్రజా సంఘాలపై దాడులకు వ్యతిరేకంగా పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 9 నుంచి 16 వరకూ జిల్లా స్థాయి, మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. దీనికి ప్రజాస్వామ్యవాదులు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేచుకట్ల సింహాచలం, జనార్దన్, గొడుగు సత్యనారాయణ, మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలదాత వర్ధంతి

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలకు సుమారు 12 ఏకరాల స్థలం ఇచ్చిన దాత కొక్కొండ రామశేషగిరిరావు పంతులు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాలలోని రామశేషగిరిరావు పంతులు దంపతుల విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకుడు పెంటకోట నాగబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పెనగంటి రాజేష్, లంక మూర్తి, యల్లపు నానాజీ, శరకణం సంతోష్, నైదాన రఘు, సంఘన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, శరకణం సత్తిబాబు పాల్గొన్నారు.